సాక్షి
మెదక్
బుధవారం । 25 । డిసెంబర్ । 2024


ఏడుపాయల


పాపన్నపేట: సూచనలు ఇస్తున్న సీఎంఓ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ప్రకాశ్

సీఎం సారూ.. విన్నపాలు వినవలె

- జిల్లావాసుల ప్రధాన డిమాండ్‌గా ఎన్‌డీఎస్‌ఎల్
- కొలిక్కిరాని ఘనపురం ఆనకట్ట పనులు
- మెదక్ రింగురోడ్డు, ఇతర సమస్యలపై దృష్టి సారించాలని ప్రజల వినతి
- ముఖ్యమంత్రి హోదాలో రేవంత్‌రెడ్డి తొలిసారి మెతుకు సీమకు రాక

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి/ మెదక్‌జోన్: ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి బుధవారం మెదక్ జిల్లాలో పర్యటించనున్నారు. ఏళ్ల తరబడి వివిధ సమస్యలతో సతమతమవుతున్న మెదక్ జిల్లా ప్రజలు ఈ పర్యటనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఎన్నికల ప్రచారానికి వచ్చిన ఆయన ఇప్పుడు సీఎం హోదాలో జిల్లాకు వస్తున్నారు. సీఎం తన పర్యటనలో భాగంగా ఆయన ఏడుపాయల వన దుర్గ మాత ఆలయాన్ని దర్శించుకోనున్నారు. అక్కడే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. అనంతరం మెదక్‌లోని కేథడ్రల్ చర్చి శతాబ్ది ఉత్సవాల్లో పాల్గొంటారు. సీఎం పర్యటన సందర్భంగా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాటు పూర్తి చేసింది.

ఏడుపాయలలో సరైన సౌకర్యాలేవి?

వనదుర్గామాత ఆలయానికి వచ్చే భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. భక్తులు బస చేసేందుకు సత్రాల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ కూడా దారుణంగా ఉంది. మురుగు కాల్వల నిర్మాణం లేవు. పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం నిర్వహణ అస్తవ్యస్తంగా మారాయి. సరిపడా మరుగుదొడ్లు కూడా లేవు ఉన్నవి నిరుపయోగంగా ఉన్నాయి. తాగునీరు డబ్బులు వెచ్చిస్తున్నారు. స్నానఘట్టాల వద్ద మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు లేవు. ఏటా రూ.పది కోట్ల వరకు ఆదాయం ఉన్నప్పటికీ ఈ క్షేత్రం వద్ద సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ఏటా మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు తెలంగాణతో పాటు, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి లక్షల్లో భక్తులు వస్తుంటారు. ప్రభుత్వం సైతం ఏటా రూ.కోటి చొప్పున నిధులు కేటాయిస్తోంది.

ఎటూ తేలని ఎన్‌డీఎస్‌ఎల్

జిల్లాలో ఏకైక చక్కెర కర్మాగారం మంభోజీపల్లి ఎన్‌డీఎస్‌ఎల్. ఇది టీడీపీ హయాంలో మూతపడడం విదితమే. దీన్ని పునః ప్రారంభించాలనే డిమాండ్ చాలా ఏళ్లుగా ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఈ ఫ్యాక్టరీ తెరిపిస్తామని హామీ ఇచ్చింది. ఈ ఫ్యాక్టరీని ప్రారంభిస్తే ఇటు చెరుకు రైతులకు, మరో వైపు కార్మికులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయి.

ఘనపురం ఆనకట్ట

జిల్లాలోని ప్రధాన సాగునీటి వనరుల్లో ఘనపురం ఆనకట్ట ఒకటి. ఎత్తు పెంపు పనులు ఏళ్లు గడుస్తున్నప్పటికీ కార్యరూపం దాల్చడం లేదు. ప్రతిసారీ ఎన్నికల అప్పుడు ఈ అంశం తెరపైకి వస్తుంది. తర్వాత ఈ పనులు పూర్తి కావడం లేదు. గత ప్రభుత్వ హయాంలో ఈ పనుల కోసం రూ.43 కోట్లు మంజూరు చేసినప్పటికీ ఈ పనులు ఇంకా కొలిక్కి రాలేదు. ప్రాజెక్టు ఎత్తు పెంచితే ముంపునకు గురయ్యే రైతులకు పరిహారం చెల్లింపుల విషయం ఎటూ తేలలేదు. దీంతో రూ.18 కోట్లు ఖర్చయినప్పటికీ ఆప్రాన్ నిర్మాణానికే పరిమితయ్యారు. ప్రస్తుతం 25 వేల ఎకరాలు సాగవుతున్నాయి. ఎత్తు పెంపు పూర్తి చేస్తే మరో 10 వేల ఎకరాల ఆయకట్టు సాగులోకి వస్తుంది.

మెదక్ రింగ్ రోడ్డు..

మెదక్ పట్టణానికి రింగ్ రోడ్డు నిర్మాణం చేయాలనే డిమాండ్ చాలా రోజులుగా ఉంది. నేటికీ ఉత్సవాలు, పండుగలు జరిగినా ట్రాఫిక్ ఇబ్బందులు వస్తున్నాయి. ఈ రింగ్ రోడ్డు నిర్మాణం పూర్తయితే ఈ ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.

పాపన్నపేట-వెంకంపల్లి రోడ్డు..

కామారెడ్డి-మెదక్ జిల్లాలను అనుసంధానించే మంజీరా నదిపై బ్రిడ్జి నిర్మాణం పూర్తయింది. కానీ పాపన్నపేట వరకు ఉన్న రోడ్డు నిర్మాణం పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీనికి నిధులు మంజూరు చేయాలి. ఈ పనులు పూర్తయితే మెదక్ - కామారెడ్డి జిల్లాల మధ్య రాకపోకలకు దూరం తగ్గుతుంది. ప్రస్తుతం పాపన్నపేట మండల ప్రజలు కామారెడ్డి జిల్లాకు వెళ్లాలంటే మెదక్‌కు వచ్చి వెళ్లాల్సి వస్తోంది. ఈ రోడ్డు పూర్తయితే కేవలం 15 కి.మీలలోనే కామారెడ్డి జిల్లా పరిధిలోకి చేరుకోవచ్చని మెతుకు సీమ జిల్లా వాసులు పేర్కొంటున్నారు.

శత వసంతానికి.. సీఎస్ఐ సిద్ధం


విద్యుత్ కాంతుల్లో సీఎస్ఐ చర్చి

శతాబ్ది ఉత్సవాలకు హాజరుకానున్న సీఎం

- ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొననున్న రేవంత్‌రెడ్డి
- 600 మంది పోలీసులతో భారీ బందోబస్తు

మెదక్‌జోన్: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. మెదక్ జిల్లా కేంద్రంలో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన సీఎస్ఐ చర్చిని నిర్మించి 100 ఏళ్లు అవుతున్న సందర్భంగా నిర్వహించనున్న శతాబ్ది ఉత్సవాలకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు. 600 మంది పోలీసులతో భారీ బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్లు ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. వందలాది సీసీ కెమెరాలు, డ్రోన్ల సహాయంతో గట్టి నిఘా ఏర్పాటు చేయనున్నారు. అలాగే వాహనాలను అంబేడ్కర్ సర్కిల్ ప్రాంతంలో, చర్చి సెకండ్ గేట్ లోపల, జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో, బోధన్ చౌరస్తా ప్రాంతంలోని చర్చిగ్రౌండ్‌లో, మాయా గార్డెన్ సమీపంలో, రూరల్ పోలీస్‌స్టేషన్ సమీపంలో వాహనాలు పార్కింగ్ కోసం కేటాయించారు.

తెల్లవారుజామున 4.30లకు ప్రారంభం ఆరాధన

క్రిస్మస్ వేడుకలు బుధవారం తెల్లవారుజామున 4.30 గంలకు మొదటి ఆరాధన ప్రారంభమవుతోంది. ఇన్‌చార్జి బిషప్ రెవరెండ్ డాక్టర్ రూబెన్‌మార్క్ ప్రారంభిస్తారు. ఇందులో సుమారు ఏడు వేల మంది భక్తులతో ఘనంగా ప్రారంభం కానుంది. అనంతరం 2వ, ఆరాధన 10 గంటలకు ప్రారంభం కానుంది. ఈ ఉత్సవాలకు తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటకతో పాటు దేశ విదేశాల నుంచి 5 లక్షల మంది భక్తులు వస్తారని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. 20 మంది గురువులను ఏర్పాటు చేయనునట్లు చర్చి ప్రెసిబిటరీ ఇన్‌చార్జి శాంతయ్య తెలిపారు.

గత ప్రభుత్వ హయాంలో విద్యారంగం నిర్లక్ష్యం

యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి

మెదక్ కలెక్టరేట్: గత ప్రభుత్వం విద్యారంగాన్ని చేసిన విధ్వంసాన్ని సరిచేయాలంటే ప్రస్తుత ప్రభుత్వం తక్షణమే నిధులు పెంచాల్సిన అవసరం ఉందని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావరవి పేర్కొన్నారు. మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీఓ భవన్‌లో టీఎస్‌యూటీఎఫ్ నిజామాబాద్ జిల్లా 6వ మహాసభ జరిగింది. కార్యక్రమానికి చావ రవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యారంగాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసిందన్నారు. యేటా ఒక్కో శాతం బడ్జెట్‌ను తగ్గిస్తూ తొమ్మిది సంవత్సరాల్లో 14 శాతం నుంచి 6 శాతానికి తీసుకొచ్చిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ప్రకటించిన మేనిఫెస్టో ప్రకారం విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పిందన్నారు. కానీ బడ్జెట్‌లో కేవలం 7 శాతం మాత్రమే కేటాయించడం సరికాదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, శ్రీనివాసరావు, పద్మారావు, రవీందర్ రెడ్డి, కవిత, అజయ్ కుమార్, సుధాకర్, నగేశ్, రవి, శేఖర్, నాగుల్ మీరా, యేసయ్య, అశోక్, భూషణం, ప్రేమ్ కుమార్, షాకీర్ అలీ, నరసింహులు పాల్గొన్నారు.

ఏడుపాయలలో భారీ ఏర్పాట్లు

- ఐజీ, సీఎంఓ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పరిశీలన


ఏడుపాయల్లో పర్యటిస్తున్న ఐజీ చంద్రశేఖర్ రెడ్డి

పాపన్నపేట(మెదక్): ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏడుపాయల వనం పోలీసుల ఆధీనంలోకి వెళ్లింది. పోలీసులు భారీ భద్రతా వలయాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, సీఎంఓ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ప్రకాశ్, కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు రక్షణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. కొల్చారం వైపు(టేకులగడ్డ) వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌ను పరిశీలించారు. అనంతరం దేవాలయ ప్రాంగణాన్ని చూసి కొన్ని సూచనలు చేశారు. వివిధ శాఖల అధికారులు అభివృద్ధి కార్యక్రమాల శిలాఫలకాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. దేవాదాయ శాఖ అధికారులు ఆలయ ప్రాంగణాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఇలా

- సీఎం ఉదయం 10.45కు బేగంపేట నుంచి హెలిక్యాప్టర్‌లో బయలుదేరి 11గంటలకు ఘనపురం చేరుకుంటారు.
- 11.05కు ఏడుపాయల, 11.30 వరకు దుర్గమ్మ దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు.
- 11.30 – 11.40 వరకు వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు.
- 11.45 ఏడుపాయల నుంచి బయలుదేరి మధ్యాహ్నానికి మెదక్.
- మధ్యాహ్నం 12 నుంచి 12.25 వరకు చర్చిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన.
- 12.25కు పోలీస్ హెడ్ క్వార్టర్ వెళ్లి 12.40కి హైదరాబాద్‌కు బయలు దేరుతారు.

రూ. 297.76 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

మెదక్ జిల్లాలో రూ.297.76 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఏడుపాయల్లో సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా పొడిచన్‌పల్లి కమాన్ నుంచి ఏడుపాయల టెంపుల్ వరకు రూ.35 కోట్లతో వేయనున్న డబుల్ రోడ్డు ,రూ.5 కోట్లతో నిర్మించనున్న స్త్రీ శక్తి భవన్‌కు శంకుస్థాపన చేస్తారు. ఆర్ అండ్ బీ శాఖ ద్వారా జిల్లా లోని వివిధ గిరిజన తండాలకు రూ.52.76 కోట్లతో రోడ్లు వేస్తారు. టీజీఈడబ్ల్యూ ఐడీసీ నుంచి రామాయంపేటలో రూ. 205 కోట్లతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ కాంప్లెక్స్‌కు శంకుస్థాపన చేస్తారు.


క్రీస్తు మార్గం అనుసరణీయం

ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి

మెదక్ కలెక్టరేట్: క్రీస్తు చూపిన మార్గం అనుసరణీయమని ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పండుగను సంతోషంగా, ఆహ్లాదకర వాతావరణంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సవాలతో జరుపుకోవాలని సూచించారు. క్రిస్మస్ పండుగ త్యాగానికి, ప్రేమ, కరుణకు తార్కాణంగా జరుపుకొంటారని పేర్కొన్నారు. మానవత్వాన్ని చాటే ఏసు క్రీస్తు బోధనలు ప్రపంచాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగిరం చేయండి

జెడ్పీ సీఈఓ ఎల్లయ్య


చేగుంట: పొలంపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న ఎల్లయ్య

చేగుంట (తూప్రాన్): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను త్వరగా పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ ఎల్లయ్య సూచించారు. మంగళవారం మండలంలోని పొలంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పంచాయతీ కార్యదర్శి స్రవంతికి పలు సూచనలు చేశారు. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని సర్వేను త్వరగా పూర్తిచేసి నివేదిక అందించాలని సూచించారు. గ్రామంలోని దరఖాస్తుదారులతో మాట్లాడి వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ కార్యదర్శి తో పాటు గ్రామ నాయకులు ఉన్నారు.

నార్సింగి, చిన్నశంకరంపేట మండలాల్లో..

చిన్నశంకరంపేట(మెదక్): ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని ఈ నెల 30 వరకు సర్వేను పూర్తి చేయాలని జెడ్పీ సీఈఓ సీహెచ్ ఎల్లయ్య కోరారు. మంగళవారం చిన్నశంకరంపేట, నార్సింగి మండల కేంద్రంలో ఆయన ఆకస్మికంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. నెలఖారు వరకు సర్వే పూర్తి చేయాలని కోరారు.

క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్ట్

కొండపాక(గజ్వేల్): పేకాడుతున్న వారిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కుకునూరుపల్లి పోలీసులు, సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు కలిసి నమ్మదగిన సమాచారం మేరకు తిప్పారం గ్రామ శివారులో పేకాట స్థావరంపై దాడి చేశారు. అక్కడ పేకాడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.8,430లతో పాటు ఆరు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడటం చట్టరీత్యా నేరమన్నారు. పేకాట, గంజాయి తదితర మత్తు పదార్థాల వినియోగం, సరఫరా చేస్తున్నట్లు తెలిసిన వెంటనే 871266 7445 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని నిజాంపూర్ రోడ్డులో మార్కండేయ నగర్ సమీపంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ మహేశ్‌గౌడ్ కథనం మేరకు.. మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన అరట్ల సతీష్ కుమార్(38) 23న రాత్రి టీవీఎస్‌పై బయటకు వెళ్లాడు. మార్కండేయ నగర్ కాలనీ సమీపంలో నిజాంపూర్ రోడ్డులో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గాయాలతో పడి ఉన్నాడు. గ్రామానికి చెందిన పలువురు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అనంతరం 108 అంబులెన్స్ ద్వారా క్షతగాత్రుడిని సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పీఎఫ్ డబ్బులు ఇవ్వడం లేదని..

- చక్కెర కర్మాగారం పొగగొట్టం ఎక్కి వ్యక్తి హల్‌చల్


పొగ గొట్టంపైకి ఎక్కిన జగదీశ్వర్

జహీరాబాద్ టౌన్: పీఎఫ్ డబ్బులు రావడంలేదని ఓ వ్యక్తి చక్కెర కర్మాగారం పొగ గొట్టం ఎక్కి హల్‌చల్ చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కొత్తూర్(బి) గ్రామానికి చెందిన జగదీశ్వర్(47) స్థానిక ట్రైడెంట్ చక్కెర కర్మాగారంలో హమాలీ పనులు చేసేవాడు. ప్రస్తుతం కర్మాగారం క్రషింగ్ లేక బంద్ ఉంది. కర్మాగార యాజమాన్యం పీఎఫ్ డబ్బులు ఇవ్వడంలేదని, వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం కంపెనీ పొగ గొట్టంపైకి హల్‌చల్ చేశాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న జహీరాబాద్ రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. భార్యను పిలిపించి ఆమెతో మాట్లాడించారు. పోలీసులు, స్థానికులు కొన్ని గంటల పాటు బతిమాలిన తర్వాత రాత్రి కిందకు దిగాడు.

కార్మికులకు ప్రోత్సాహకాలు


కార్మికులతో డీఎం మల్లేశయ్య

నారాయణఖేడ్: ఖేడ్ ఆర్టీసీ డిపోలో ఉత్తమ ప్రతిభను కనబర్చిన డిపోకు చెందిన డ్రైవర్లు, కండక్టర్లకు మంగళవారం డిపో మేనేజర్ మల్లేశయ్య నగదు ప్రోత్సాహకాలు, ధ్రువపత్రాలు అందజేశారు. ప్రోత్సాహకాలు దినవారిని ఇతరులు స్ఫూర్తిగా తీసుకుని ప్రయాణికులకు మెరుగైన సేవలతో పాటు డిపోకు అధిక ఆదాయాన్ని తీసుకువచ్చేలా కృషి చేయాలని డీఎం సూచించారు. మెకానికల్ ఇంజనీర్‌శరథరావు, అసిస్టెంట్ మేనేజర్ నర్సింహులు, సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నందులాల్, పీఆర్వో పాండు, సెక్యూరిటీ హెడ్‌కానిస్టేబుల్ సత్యనారాయణ పాల్గొన్నారు.


ఉపరాష్ట్రపతి పాల్గొనే రైతు సమ్మేళనం సభా ప్రాంగణం


హెలీప్యాడ్ వద్ద మట్టి చదును పనులు

నేడు కేవీకేకు ఉపరాష్ట్రపతి రాక

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- 1,000 మంది రైతులతో సమ్మేళనం
- మొక్కలు నాటి,సేంద్రియ సాగు పరిశీలన
- వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి 11 స్టాల్స్ ఏర్పాటు
- కలెక్టర్, సిరిసిల్ల, కామారెడ్డి, స్థానిక ఎస్పీల ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు


కేవీకేలో స్టాల్స్ కోసం చేసిన ఏర్పాట్లు

కౌడిపల్లి(నర్సాపూర్): కేవీకే ఆధ్వర్యంలో సేంద్రియ సాగు, ప్రకృతి వ్యవసాయం చేసే రైతు సమ్మేళనంలో పాల్గొనేందుకు బుధవారం కౌడిపల్లి మండలం తునికి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే)కు ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర, రాష్ట్ర మంత్రులు కిషన్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, అఖిల భారత కార్యకరిని సదస్య భాగయ్య రానుండటంతో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. వారం రోజులుగా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాలోని వివిధ శాఖల అధికారులు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నారు. సమ్మేళనానికి జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి సేంద్రియ సాగు చేస్తున్న 1,000 మంది రైతులు కేవీకేకు రానున్నారు. దీనికోసం సభా ప్రాంగణం ఏర్పాటు చేశారు. కేవీకేతోపాటు హైదరాబాద్ ఐఐటీ, ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం, ఇతర వ్యవసాయ ఉత్పత్తుల కంపెనీల ఆధ్వర్యంలో వ్యవసాయ ఉత్పత్తులకు సంబంధించి 11 స్టాల్స్ ఏర్పాటు చేయనున్నారు.

ఉప రాష్ట్రపతి పర్యటన

తునికి కేవీకేకు బుధవారం మధ్యాహ్నం 2.30కు ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హెలీక్యాప్టర్‌లో చేరుకోనున్నారు. సాయంత్రం 4.30 గంటల వరకు సుమారు రెండుగంటల పాటు కేవీకేలో ఉంటారు. ఇందులో కేవీకేలో మొక్కలు నాటి, సేంద్రియ సాగుతో పాటు అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తారు. సేంద్రియసాగు రైతులతో మాట్లాడిన అనంతరం ఉపరాష్ట్రపతి మాట్లాడనున్నారు. 4.30 గంటలకు హెలిక్యాప్టర్‌లో తిరిగి వెళ్తారని కేవీకే హెడ్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్, అధికారులు తెలిపారు.

ఐజీ చంద్రశేఖర్ పరిశీలన

ఉపరాష్ట్రపతి రాక సందర్భంగా మంగళవారం ఐజీ చంద్రశేఖర్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డితో కలిసి కేవీకేను పరిశీలించారు. హెలీప్యాడ్స్, సభా స్థలం, స్టాల్స్ ఏర్పాట్లు, పార్కింగ్, చెక్ పోస్ట్ తదితర స్థలాలను ఐజీ పరిశీలించగా ఎస్పీ వివరించారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని సూచించారు. దీంతోపాటు అదనపు కలెక్టర్ నగేశ్, ఆర్‌డీఓ మహిపాల్‌రెడ్డి, ఇంటలిజెన్సీ డీఎస్పీ రవీందర్, అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ వెంకట్‌రెడ్డి పోలీసులు ఆధ్వర్యంలో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఇక్కడ మూడు హెలీప్యాడ్స్ ఏర్పాటు చేయగా బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందం తనిఖీ చేసింది. పాస్‌లు లేనిదే ఎవరినీ అనుమతించొద్దని సూచించారు. హెలీప్యాడ్‌పై దుమ్ము లేవకుండా పేడ నీళ్లు చల్లి క్యూరింగ్ చేశారు.


హెలీప్యాడ్, ఇతర ప్రదేశాలను పరిశీలిస్తున్న ఐజీ చంద్రశేఖర్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

500 మంది పోలీసులతో బందోబస్త్

రైతు సమ్మేళనానికి సిరిసిల్లా జిల్లా ఎస్పీ అఖిల్‌మహాజన్, కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ పర్యవేక్షణలో జిల్లా ఎస్పీ సూచనలతో 500 మంది పోలీసులతో భారీ బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ తెలిపారు. ఆరుగురు డీఎస్పీలు, 20 మంది సీఐలు, 50 మంది ఎస్ఐలు, 500 పోలీసులు పాల్గొంటారని పేర్కొన్నారు. దీంతోపాటు ఎయిర్‌ఫోర్స్, ఇంటెలిజెన్స్, ఐబీ, ఢిల్లీ పోలీస్, లోకల్ పోలీసులు పర్యవేక్షిస్తారని తెలిపారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో భోజనాలు

కేవీకేలో జరిగే రైతు సమ్మేళనంలో పాల్గొనే రైతులు, అధికారులకు ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో భోజనం ఏర్పాట్లు చేస్తున్నారు. దీని కోసం సుమా రు 150 మంది ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖులు కేవీకేకు వచ్చారు. మంగళవారం భోజనాలు ఏర్పాటు చేశారు.

భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు రావాలి


పాలకవర్గ సభ్యులను సన్మానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: కేంద్ర ప్రభుత్వ స్వచ్ఛ సర్వేక్షన్‌లో హుస్నాబాద్ మున్సిపాలిటికీ నాలుగేళ్లుగా జాతీయ అవార్డు వస్తుందని, భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకాంక్షించారు. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా మున్సిపాలిటికీ 'చేంజ్ మేకర్స్ కాంక్లెవ్' అవార్డు రావడంపై మంగళవారం రాత్రి మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గ సభ్యులు, అధికారులు, శానిటేషన్ సిబ్బందిని మంత్రి సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. జాతీయ అవార్డు రావడం ఏ ఒక్కరితో సాధ్యం కాదన్నారు. ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రవికుమార్‌కు ప్రత్యేక అభినందనలు, ప్లాన్ నివేదిక తదితర వాటితోనే అవార్డు వచ్చిందన్నారు. ఎల్లమ్మ దేవాలయం, పొట్లపల్లి ఆలయం, మహా సముద్రం గండి, గౌరవెల్లి ప్రాజెక్టు తదితర వాటితో మరింత అభివృద్ధి చేస్తామన్నారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు రావాలంటే అందరూ సమష్టిగా కష్టపడి పని చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం

పట్టణంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను మంత్రి సందర్శించారు. విద్యార్థినులకు లక్ష్య సాధనలో ఎలా విజయం సాధించాలని కథలు చెబుతూ ఉత్సాహాన్ని నింపారు. వారితో కింద కూర్చొని సామూహిక భోజనం చేశారు. దాదాపు రెండు గంటల పాటు విద్యార్థినిలతో ఉండి భోజనం, ఇతర సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. పాటలు పాడి కథలు చెప్పిన వారిని మంత్రి సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవలు పొందండి

- ఈ సేవా కేంద్రం ప్రారంభంలో జడ్జి శ్రావణియాదవ్

గజ్వేల్‌రూరల్: న్యాయ సేవల కోసం ప్రజలు ఈ సేవా కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ ఇన్‌చార్జి జడ్జి, సిద్దిపేట ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రావణియాదవ్ సూచించారు. పట్టణంలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో మంగళవారం ఈ సేవా కేంద్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేసుల స్థితిగతులు, తదుపరి విచారణ తేదీ, సర్టిఫైడ్ కాపీలకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. అలాగే, ఈ స్టాప్ పేపర్ల కొనుగోళ్లలో కక్షిదారులకు సహాయపడటం, ఆధార్ ఆధారిత డిజిటల్ సంతకాన్ని పొందడం, ఈ ములాఖత్ అపాయింట్‌మెంట్ ద్వారా జైలులో ఉన్న బంధువులను కలవడానికి, ట్రాఫిక్ చలాన్లు, చిన్న నేరాలకు సంబంధించిన ఫైన్ చెల్లింపులను చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏజీపీ కిరణ్‌సాగర్ రావు, న్యాయవాదులు కాశీ ప్రసాద్, వనం భాస్కర్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


ఈ సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి జడ్జి శ్రావణియాదవ్

అమిత్‌షాను బర్తరఫ్ చేయాల్సిందే..

- డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి
- కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నర్సారెడ్డి, తదితరులు

సిద్దిపేటరూరల్: డాక్టర్ బీ.ఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షాను వెంటనే బర్తరఫ్ చేయాలని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి అమిత్‌షాపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజల ఆశాజ్యోతి అయిన బీఆర్ అంబేడ్కర్‌పై అమిత్‌షా వాఖ్యలు చేయడం సరికాదన్నారు. రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని ఎంతో గౌరవాన్ని ప్రదర్శించారన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు బొమ్మల యాదగిరి, ఆంక్షారెడ్డి, గోపికృష్ణ, అత్తు, కలీం, లక్ష్మి, వాహబ్, ఆనంద్, బీసీ, ఎస్‌సీసెల్ నాయకులు పాల్గొన్నారు.

మంత్రి పీఏ పేరుతో బెదిరింపులు

- వైద్యుడికి ఫోన్‌కాల్స్
- కేసు నమోదు చేసిన పోలీసులు

సిద్దిపేటకమాన్: మంత్రి పీఏనంటూ బెదిరింపులకు పాల్పడిన ఓ వ్యక్తిపై సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన డాక్టర్ ప్రసాద్‌గౌడ్‌కు కొద్ది రోజులుగా సిద్దిపేట పట్టణానికి చెందిన పాతర్ల మహేశ్ అనే వ్యక్తి తాను మంత్రి (పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి) పీఏను అని చెప్పి ఫోన్‌లో బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితుడు సిద్దిపేట వన్ టౌన్ పోలీసులకు వారం రోజుల కిందట ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టిన పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


రాష్ట్రస్థాయి ఖోఖో జట్టులో శివ్వంపేట యువకులు


ఎంపికైన యువకులు

శివ్వంపేట(నర్సాపూర్) : రాష్ట్రస్థాయి సీనియర్ ఖోఖో జట్టులో శివ్వంపేటకు చెందిన ఇద్దరు యువకులు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి సీనియర్ ఖోఖో పోటీలు సిద్దిపేటలో నిర్వహించారు. ఇందులో రవీందర్, తిరుపతి రాథోడ్ ప్రతిభ కనబర్చడంతోరాష్ట్రస్థాయి జట్టులో చోటు లభించింది. వచ్చే నెలలో వరంగల్‌లో జరిగే రాష్ట్రస్థాయి జట్టులో వీరు పాల్గొననున్నారు.

గంట చరిత్ర ఘనం

- చర్చిలో ఏర్పాటు చేసి వందేళ్లు..
- బరువు ఐదు క్వింటాళ్లు
- ధ్వని పది కిలోమీటర్ల పరిధి
- నిత్యం మూడు సార్లు శబ్దం
- ఆరాధన సమయంతోపాటు చర్చి సభ్యులు చనిపోయినా మోగిస్తారు


చర్చి పైభాగంలో కట్టిన గంట

మెదక్‌జోన్ : ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్ఐ చర్చి నిర్మాణంలో ప్రతీది ప్రత్యేకమే. 10 ఏళ్ల పాటు సాగిన నిర్మాణాంతరం 1924 డిసెంబర్ 25న చర్చిని ప్రారంభించారు. చర్చిలో ప్రారంభంలో ప్రతి రోజూ ఉదయం 7 గంటలకు, మధ్యాహ్నం 12 గంటలకు, సాయంత్రం 6 గంటలకు ప్రార్థనలు జరిగేవి. ఆ సమయం ప్రజలకు తెలిసేందుకు గాను ఇంగ్లాండ్‌లో కంచుతో ప్రత్యేకంగా తయారు చేయించిన 5 క్వింటాళ్ల బరువు ఉన్న కంచు గంటను చర్చి శిఖరం పై భాగాన 175 అడుగుల ఎత్తులో కట్టారు. దానిని తాడు ఆధారంగా నేటికి రోజుకు 3 సార్లు మోగిస్తారు. ప్రతి ఆదివారం ఆరాధన సమయంలోనూ దీనిని కొడతారు. ఇది అత్యంత ఎత్తులో ఉండటంతో దీని ధ్వని సుమారు 10 కిలోమీటర్ల వరకు వెళ్తుంది. చర్చి శబ్దం కాగానే ప్రజలు సమయాన్ని గుర్తించటంతోపాటు చర్చిలో ప్రార్థనలు ప్రారంభమయ్యాయి అని అనుకుంటారు. అలాగే చర్చి సభ్యులు ఎవరైనా చనిపోయినా దీన్ని ప్రత్యేకంగా మోగిస్తారు. ఈ నేపథ్యంలో సదరు సభ్యుడు 50 ఏళ్ల వయస్సుకు చనిపోతే 50 సార్లు కొడతారు. వందేళ్ల వయస్సులో చనిపోయినట్లు అయితే వందసార్లు దీన్ని మోగిస్తారని ఓ గురువు తెలిపారు.

తేమ సాకుతో పత్తిని తిరస్కరించొద్దు

- బోగస్ రైతులు వస్తే కఠిన చర్యలు తీసుకోండి
- జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు


మిల్లులో రిజిస్టర్లను పరిశీలిస్తున్న డీఎంఓ నాగరాజు

హుస్నాబాద్‌రూరల్: పత్తి రైతులను సీసీఐ కేంద్రాల అధికారులు తేమ సాకుతో ఇబ్బందులు పెట్టొదని జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు అన్నారు. మంగళవారం పందిళ్లలో బాలాజీ, రాజరాజేశ్వర కాటన్ మిల్లులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీసీఐ కేంద్రాలకు పత్తి తీసుకొచ్చిన రైతులతో డీఎంఓ మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామాల నుంచి పత్తి తీసుకొచ్చే రైతుల కష్టాలను చూసి సీసీఐ అధికారులు తేమ శాతంలో వెసులుబాటు కల్పించాలని సూచించారు. దూర ప్రాంతాల నుంచి పత్తి తీసుకొని వచ్చిన రైతులను తేమ పేరుతో తిరస్కరిస్తే అతను మళ్లీ ఇంటి పత్తి తీసుకపోలేడని ఇక్కడే ప్రైవేటులో అమ్ముకొని వెళ్తాడన్నారు. సీసీఐ అధికారులు పత్తిని పరిశీలించి తేమ విషయంలో సడలింపులు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ఆన్‌లైన్‌లో పంటల నమోదు చేసుకోని రైతుల విజ్ఞప్తి మేరకు వ్యవసాయ అధికారుల ధ్రువీకరణ పత్రాలతో పత్తి తీసుకోవాలని సూచించామన్నారు. ఆన్‌లైన్‌లో పంటల వివరాలు ఉంటే పత్తి ఎక్కడి సీసీఐ కేంద్రములోనైనా అమ్ముకునే వెసులుబాటు రైతులకు ఉందన్నారు. బోగస్ రైతుల పేరున వ్యాపారులు సీసీఐ కేంద్రాల్లో పత్తి అమ్ముకుంటే కఠిన చర్యలు తీసుకోవాలని మార్కెట్ కార్యదర్శికి సూచించారు. పత్తి పంటలు సాగు చేసిన రైతులకు మాత్రమే వ్యవసాయ అధికారులు ఆన్‌లైన్ చేస్తే బోగస్ రైతుల పేరుతో వ్యాపారుల అగడాలు జరగవన్నారు. వీరి వెంట మార్కెట్ కార్యదర్శి పత్తి మిల్లుల యాజమానులు ఉన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


అలావత్ రెడ్డి(ఫైల్)

నర్సాపూర్ రూరల్: అప్పుల బాధతో ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నర్సాపూర్ ఎస్సై లింగం కథనం మేరకు.. నర్సాపూర్ మండలం తుజాల్ పూర్ పంచాయతీ పరిధిలోని అర్జు తండాకు చెందిన అలావత్ రెడ్డి(26) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మృతుడి భార్య బుజ్జి కొద్ది రోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. సోమవారం రెడ్డి కూతురు మంజుకు జ్వరం రావడంతో నర్సాపూర్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించాడు. సాయంత్రం కూతురు, , భార్యని ఆటోలో అర్జు తండాకు పంపించాడు. తాను మాత్రం నర్సాపూర్ నుంచి రాత్రి 9 గంటల వరకు వస్తానని చెప్పాడు. అదే రోజు రాత్రి నర్సాపూర్ పట్టణంలోని రాయరావు సమీపంలోని చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం అటుగా ఉదయం వాకింగ్‌కి వెళ్లిన వారు చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. భార్య బుజ్జి, పిల్లలు మంజు, నితీష్ తరచూ అనారోగ్యాల బారిన పడటం చికిత్సల నిమిత్తం అప్పులు చేయడంతో దిగులు చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కల్లు డిపోలపై దాడులు

13 గ్రాముల ఆల్ఫాజోలమ్, 800 లీటర్ల కల్తీ కల్లు స్వాధీనం


తనిఖీలు చేస్తున్న పోలీసులు

సిద్దిపేటకమాన్: కల్లు డిపోలపై పోలీసులు దాడులు నిర్వహించి ఆల్ఫాజోలమ్‌తోపాటు కల్తీ కల్లు స్వాధీనం చేసుకున్న ఘటన సిద్దిపేట పట్టణంలో చోటు చేసుకుంది. పోలీస్ అధికారుల కథనం మేరకు.. సిద్దిపేట పట్టణ, పరిసర ప్రాంతాల్లోని పలు కల్లు దుకాణాలపై యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులతో కలిసి ఏసీపీ మధు, సీఐలు వాసుదేవరావు, ఉపేందర్, విద్యాసాగర్, సిబ్బంది మంగళవారం ఏకకాలంలో దాడులు నిర్వహించారు. భరత్‌నగర్, ఇందిరమ్మ కాలనీ, పటేల్‌పురా, రంగదాంపల్లి కల్లు దుకాణాల్లో తనిఖీలు చేసి 13 గ్రాముల ఆల్ఫాజోలమ్, 800 లీటర్ల కల్తీ కల్లు స్వాధీనం చేసుకున్నారు. పల్లె రాములు, అంబటి రాజు, పల్లె అంజయ్యగౌడ్, బొడిగె శ్రీనివాస్‌గౌడ్‌లను అదుపులోకి తీసుకున్నారు. అలాగే, గాదగోని ప్రకాశ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, పల్లె అనీల్, ముంద్రాయి రాజు, గడ్డమీది రాజగౌడ్ పరారీలో ఉన్నారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రతీ అర్జీని పరిష్కరిస్తాం

- కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి
- ప్రజావాణికి 75 దరఖాస్తులు

సిద్దిపేటరూరల్: ప్రజావాణికి వచ్చిన ప్రతీ అర్జీ పరిష్కరించాలని కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఎంతో ఆశతో అందించే అర్జీలను ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. తదితర సమస్యలపై మొత్తం 75 దరఖాస్తులు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఆర్‌ఓ నాగరాజమ్మ, డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్యా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నా భూమిని ఇప్పించండి సారూ..

నా పేరు నార్ల రఘుపతిరెడ్డి. కొండపాక మండలం సిరిసినగండ్ల గ్రామం. గ్రామంలోని సర్వే నంబర్ 457, 463, 460లోని భూమి నా భార్య పేరుపై పట్టా నమోదై ఉంది. ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నాను. ఈ క్రమంలో నా భూమిని పాలివాళ్లు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. నన్ను బెదిరించడమే కాకుండా బోరు స్టార్టర్ వంటివి పగలగొట్టారన్నారు. ఆ భూమి శ్రీకాంత్‌రెడ్డికి సంబంధించినదంటూ తనను భూమిలోకి వెళ్ళవద్దని బెదిరిస్తున్నారన్నారు. ఎలాగైనా అధికారులు ఎంసీ ద్వారా సర్వే చేయించి నాభూమిని ఇప్పించాలని కోరారు.


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న చేర్యాల డివిజన్ ఏర్పాటు జేఏసీ నాయకులు

రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయండి

సిద్దిపేటరూరల్: అన్ని అర్హతలు ఉన్న చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరుతూ జేఏసీ చైర్మన్ ఆర్ పరమేశ్వర్ అన్నారు. ఈ మేరకు మంగళవారం చేర్యాల నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు తరలివచ్చారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం ప్రభుత్వ హయాంలోనే ఉమ్మడి నల్గొండ జిల్లాలో చేర్యాల ఒక ప్రముఖమైన పట్టణంతో పాటు మున్సిపాలిటీగా, తాలూకా కేంద్రంగా ఉండేదన్నారు. తదనంతర కాలంలో వరంగల్ జిల్లాలో విలీనం అయినప్పటికీ పంచాయతీ సమితి కేంద్రంగా, నియోజకవర్గ కేంద్రంగా, తాలూకా కేంద్రంగా ఉంటూ జిల్లాలోనే ఒక ప్రభలమైన రాజకీయ శక్తిగా కొనసాగుతూ వచ్చిందన్నారు. ఎంతో చరిత్ర కలిగిన చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు గిరి కొండల్ రెడ్డి, పుర్మ ఆగంరెడ్డి, దాసరి కళావతి, అందె అశోక్, మల్లిగారి యాదగిరి పాల్గొన్నారు.